కర్తవ్యం

పి.పద్మావలి

అసుర సంధ్యవేళ, పగలంతా సర్వ జీవరాశుల్ని తన వేడి కిరణాలతో గడ, గడ లాడించిన భాస్కరుడు, సంధ్యాదేవి పిలుపుకు చల్లబడి, ఆమె పలికురుల్లో తేలియాడసాగాడు పడమట అంతా రుధిర వర్ణంతో ఆకాశం శోభిస్తూంది పక్షులు గూళ్ళకి, మనుష్యులు తమ నివాసాలకి చేరుకుంటున్నారు. ప్రతి జీవికి ఒకే ఆశయం, అది తమ బిడ్డలకి మనసారా శ్రమించి, చమటోడిచి, బిడ్డలకు కడుపు నింపాలని అందులో, మనుష్యులకు, ఎంత రక్కసులయినా కడుపు శోకానికి వివశులయి దానివలన ''ఇలా చేస్తే నా పాపకు మంచిదికాదే'', ''ఇలా చేస్తే నా బిడ్డకు పాపం చుట్టుకొంటుంద్దేమో'' అని ఒక్కోసారి తన పాప, పుణ్యాల పుటలని తిరగవేసుకొంటాడు

అమ్మా అని అరిచినా అంకించవేమమ్మ,
ఆవేదన తీరు రోజు ఈ జన్మకు లేదా . ..

ఘంటసాల రికార్డు నుండి వేదనాభరితంగా, మధురంగ, వినవస్తూంది కంఠం. పాట! అన్యమనస్కంగా శూన్యంలోకి చూస్తూ ఆ పాటనే తన జీవితానికి పోల్చుకొంటున్న ప్రవీణకి పాప, బాబు వచ్చి తన కాళ్ళని చుట్టుకోగానే ఉలిక్కిపడి లేచింది ఐదేళ్ళ పాప,

ఆదేవిటమ్మ ఏడుస్తూన్నావు అంది ప్రేమ ఉట్టిపడుతున్న స్వరంతో, ఆందోళన బాబు మాత్రం తల్లి కుచ్చెళ్లతో దాగుడుమూతలు ఆడుకొంటున్నాడు

''ఏంలేదమ్మా'' అంటూ తన చిన్నారి పాపకి తనంటే కల్గిన ప్రేమాభిమానాలు, ఆ చిన్న గుండెలో తనపట్ల తనకన్నీటికి, ఆందోళన గమనించేసరికి ప్రవీణకు ఆనందమయినది మెల్లగా పాపను, బాబుని దగ్గరకు చేర్చుకొంది వీళ్ళు తన ప్రాణాలు తనని అనుక్షణం ''మమ్మీ, మమ్మీ'' అని కలవరించే ఈ పాపలు తన జీవన జ్యోతులు. తన రక్తమాంసాలు పుణికిపుచ్చుకుని, తన ఉనికిని ఈ లోకంలో తమ ద్వారా, తన సంతానాన్ని ద్వారా, తన పేరుని శాశ్వతంగా చిరస్థాయిగా నిలుపుతారు ఈ భూమిపైన ఇంతకంటే సామాన్య గృహిణిగా, మాతృమూర్తిగా, స్త్రీగా, తన కింకేం కావాలి ముందు వర్తమానంలో, తాత్కాలికంగా తన బాధను మరిచిపోయిన ప్రవీణ ఎవరో ఛెళ్ళున వీపున చరిచినట్లుగా ఉ క్కిపడింది లోనుంచి యెవరో అసహనంగా ప్రశ్నించారు.

నీ తల్లి నీ గురించి ఇలా యెన్నో ఆశలు అల్లుకుంది. చివరిరోజుల్లో, నీ నీడలో సేదతీరాలని ఆశించింది. తన రక్తాన్ని ధారపోసి, సౌభాగ్యాన్ని, సకల సంపదలని సమకూర్చింది. ఆ తల్లిపట్ల నీ కర్తవ్యాన్ని యెంతమాత్రం నిర్వర్తించగలిగావు. అంతరాత్మ ప్రశ్నలకి నిస్సహాయంగా, బేలగా రోదిస్తూ వుండిపోయింది ప్రవీణ.

''అమ్మగారూ!'' లోనుంచి పని మనిషి లక్ష్మి పరుగు, పరుగున వచ్చింది.

''అమ్మా! ఈవేళ తమరు యెక్కడికో వెళ్లాలన్నారుగా. ఉల్లి నూరి సిద్ధంచేసాను రండమ్మా, కుక్కర్‌లోకి పెట్టేసుకొందురుగాని'' అంది.

మెల్లగా తేరుకొంది ప్రవీణ. ఔను వారు వచ్చేస్తే హడావుడి పెడతారు త్వరగా అన్నీ అయిపోవాలి అనుకొంటూ, పిల్లల్ని జాగ్రత్తగా ఆడుకోమని హెచ్చరించి, లక్ష్మిని అనుసరిస్తూ ఇంట్లోకి ప్రవేశించింది. గ్యాస్ అంటించి వంటలో నిమగ్నమయిన ప్రవీణకు వరండాలో సందడి వుంజుకునేసరికి, బయటకు వచ్చింది. అత్తగారు, మరిది, ఆడపడుచు కనిపించారు. 'రండి, రండి' అంటూ సాదరంగా వాళ్ళని పిలిచింది.

అత్తగారి ముఖంలో తనపట్ల తేలికభావం 'నా కొడుకు ఇంటికి నన్ను రమ్మనేటంతటి నెరజాణవా' అన్నట్లు నిరసన ఆడపడుచు ముఖంలో తనపట్ల ఆదోరకంగా నిర్లక్ష్యభావం ఇవన్నీ గమనించిన ప్రవీణకు ఒక్కసారిగా నీరసం ముంచుకువచ్చింది. మెల్లగా వాళ్ళకి కావల్సినవి అందిస్తూ వుండిపోయింది భర్త రాకకోసం ఎదురుచూస్తూ

''వదినా! అన్నీ కొన్నారుకాని డ్రస్సింగ్ టేబుల్ లేదేవిటి'' అంది, ఆడపడుచు అన్నగారి ఇల్లు నలుమూలలా పరిశీలిస్తూ, కనులు ఆదోరకంగా తిప్పతూ

''ఆఁ అది తెచ్చేసరికి దీని పిల్లలకి కాస్త పెళ్ళిళ్ళే అవుతాయి. ఇంతటి డాక్టర్‌కి ఈనాటి వరకు ఏ విలువైన సామాను పెట్టలేకపోయారు దీని పుట్టింటివాళ్ళు'' అత్తగారి ఈసడింపు మాటలకి ఒక్కసారి భగ్గుమంది ప్రవీణ మనసు

''అత్తగారూ! మీ అబ్బాయి యింతటి డాక్టరు యెలా అయ్యారో తెలియదా? మీకు ఎన్నివేల ఖరీదులో ప్రాక్టీసు పెట్టించింది ఎవరో మరిచిపోయారా? మీ అబ్బాయికి కాకుండా మీకు, మీ సంసారానికి అన్ని లాంఛనాలతో పాటు మిమ్మల్నందర్నీ మా నాన్నగారు ఎలా తీర్చిదిద్దారో, మరిచిపోయారా'' అనుకొంది మనసులో బాధగా

కోడలి ముఖం వివర్ణమవడం గమనించి అందుకొంది అత్తగారు మళ్ళీ

''చాల్లే! ఏమైనా అంటే ఏడుపుముఖం పెడతావు వచ్చిని ఇంట్లో అలా ఏడుపుముఖం పెట్టకూడదంటారు'' అంది, ఈసడింపుగా

ఎవరో ''డాక్టరుగారు వున్నారా ?'' అంటూ రావడంతో భారంగా ఆ దిశగా అడుగులు వేసింది ప్రవీణ. ''ఏం మనుషులు వీళ్ళు ? యెంతసేపు పెట్టుపోతలుతప్ప యెదుటివాళ్ల మంచిచెడులు గుర్తించే స్థితిలో వుండవా వీళ్ల ఆలోచనలు. అమ్మకి యెంతో సుస్తీ చేసిందని తెలిసి తను ఎలా కుమిలిపోతూంది. కనీసం మీ అమ్మ యెలా వున్నారు, అని అయినా అడగలేదు'' అనుకొంది ప్రవీణ బాధగా.

రాత్రి తొమ్మిది గంటలకు వచ్చాడు మోహన్ తల్లిని, చెల్లిని, తమ్ముణ్ణి ఆదరంగా పలకరించి అందరూ భోజనాలకు కూర్చున్నారు. మోహన్ ప్రవీణను బలవంతంగా కూర్చోబెట్టాడు ప్రవీణ అన్యమనస్కంగా వుండడం గమనించాడు మోహన్. చెల్లి, తమ్ముడు ఏవో అన్నగార్కి తగని కబుర్లు చెప్పేస్తున్నారు. ప్రవీణనే గమనిస్తున్న మోహన్‌కి విసుగుపుట్టింది. ఛ, ఛ, ఎప్పుడూ ఏడుపు ముఖమేనా ! తను యెప్పుడూ ప్రవీణ ముఖంలో నవ్వునే చూడాలనుకొంటాడు. ప్రవీణ అందంగా, ఆనందంగా, చిరునవ్వులు వలకబోస్తూ వుండాలని తన ఆకాంక్ష. అత్తగారికి బాగాలేకపోయినంతమాత్రాన ఏం ముంచుకుపోయిందో తన కర్థంకాదు. ఏం, లోకంలో తనేనా తల్లిని, తండ్రిని, విడిచి అత్తవారింటికి రావడం. వట్టి సెంటిమెంటల్ ఫూల్ ! విసుక్కున్నాడు.

''ఒరె అన్నయ్యా, మీ పిల్లలకి పూర్తిగా వాళ్ల పోలికలేరా, మన పోలికలు రాలేదుకదూ'' అంది ఆడపడుచు ఎగతాళిగా, ఎక్కసెక్కంగా బియ్యే చదువుతున్న తన పుత్రిక అధికప్రసంగ చాతుర్యానికి మురిసిపోతూంది అత్తగారు

తన రక్తం పంచుకొని పుట్టినందుకు తనని యెంతో ఆదరణగా, చెల్లికోసం, తమ్ముడికోసం ఉన్నత సోపానాలను నిర్మించాలని, కలలుకనే తన అన్నగారి ముద్దు సంతానాన్ని అనవలసిన బియ్యే చదువుతూ, నాగరికత, జలతారు పరదా కప్పకున్న నవీన కన్య అనవల్సిన మాటలు ఇవా ? ప్రవీణ మనసు విలవిలలాడింది. ఈ రోజులలో విద్య విజ్ఞానంకోసం ఉపయోగపడడంలేదు జీవనాధారంకోసం మాత్రమే

ఆరాత్రి పడుకోబోతుంటే అడిగాడు మోహన్ ప్రవీణని దగ్గరకు తీసుకొంటూ ''సారీ వీణా ! ఈరోజు ఎంతో త్వరగా రావాలని, నిన్ను, పిల్లల్ని పిక్చర్‌కి తీసుకువెళ్లాలని యెంతో ఉబలాటపడ్డాను. కాని సరిగ్గా ఒక సీరియస్ కేస్ రావడంతో ఆగిపోవలసివచ్చింది'' అన్నాడు.

తరువాత నాలుగురోజులు అత్తగారి దెప్పుళ్ళు, ఆడపడుచు ఎగతాళి మాటలు, మరిది నిర్లక్ష్య ధోరణిని సహనంగా భరిస్తూ వాళ్ళకి కావల్సినవిధంగా నడుచుకుంటూంది. తరువాత కొడుక్కి వివిధ రకాలుగా జాగ్రత్తలు సూచిస్తూ తమ ఖర్చులు యెలా పెరిగిపోతున్నాయో ఏకరువుపెట్టి ఇంకా ఎక్కువ డబ్బు పంపించాలని కోరుతూ సెలవుతీసుకొని వెళ్లిపోయారు. భారంగా నిట్టూర్చింది ప్రవీణ.

కర్తవ్యం

ఆడపడుచు మరదుల చదువువల్ల ఈ పల్లెటూరులో కుదరదని అత్తగారు వాళ్ళు పట్నంలో వుంటున్నారు. ఈ చుట్టుపట్ల పల్లెల్లో మరెక్కడా ఆసుపత్రులు లేక రాబడికోసం నాన్నగారు యెన్నో కష్టనిష్టూరాలు భరించి ఇక్కడ ప్రాక్టీసు పెట్టించారు. అందువల్ల తను ఈమాత్రం సుఖానికి అయినా నోచుకోకలుగుతూంది. అంటే తన భర్త అన్ని వ్యసనాలతో భార్యను హింసిస్తాడనికాదు ఎందరో ఊహిస్తున్న ఉత్తముడుగా తనని చాలా బాగా ఆదరంగానే చూస్తాడు. అదేం పాపమో మరి తనకి ఆ స్వార్థం అంటే చాలా అసహ్యంగా వుంటుంది. అతనికి తనే తప్ప తనని రక్తమాంసాలు పణంగాపెట్టి తమ సర్వదాస్తిని అతనికి ధారపోసిన అత్తమామలంటే కృతజ్ఞత లేదు మొన్న అమ్మకి చాలా సుస్తీపడిందని తెలిసి తను వెళితే ఆ రెండురోజులు అమ్మ దగ్గరుండి తను అన్నీ చేస్తూ తనకి జన్మ యిచ్చిన తల్లికి కొద్దిరోజులుగా దగ్గరుండి సేవ చేయాలని. యెంతో ఆశించింది అలా వీల్లేదని తనతో వస్తేనే, ఈ యింట్లో స్థాన ముంటుందని, లేకుంటే మళ్ళీ ఇంటిగడప తొక్కద్దని యెంత నిర్భయంగా చెప్పగలిగారు. తను ఏడుస్తూ కుమిలిపోతూ వచ్చేసింది. ఆడపిల్ల

త్వరలో

స్వయంవరం

సీరియల్

సమస్య వరకట్నానిదే కాదు. ఎన్ని శ్రమల కోర్చి వున్న ఆస్తిని హారతిలా కరిగించి అల్లుడ్ని తేవడంతోనే సరిపోదు. దిక్కు మొక్కు లేని అనాధల్లా చివరి క్షణాల్లో అంతిమ వూపిరి బరువుగా విడుస్తారు. ఎక్కడుంది ధర్మం ? వరకట్నం పాపం, పాపం అని ఎలుగెత్తి అరుస్తున్న ఈ సమాజంలో తరువాత ఈ తిబాధలు తీర్చేదెవ్వరు ? వరుడు భరించేవాడు కాబట్టి తమకున్న దానిలో సగర్వంగా తమ వధువుని ధారపోయడం, దానితో లాంఛనం పేరుతో కొద్ది బహుమతులని ఇవ్వడం ఆచారంగా పరిగణించబడింది. అలా వెళ్లిన స్త్రీకి భర్త ప్రత్యక్షదైవం అవడంలో ఆశ్చర్యంలేదు ఆనాటి స్త్రీకి కాని ఈనాటి స్త్రీకి వేట, లక్షలకొద్ది కట్నకానుకలతో పాటు ఇల్లు, ఇల్లుతోపాటు ఇంట్లో ఫర్నీచరు, వండుకునే పొయ్యి దగ్గర్నుంచి పాత్రలు వరకు, తినే సరకులు కూడా తను తెచ్చినదే, పైగా తన తల్లి, తండ్రులంటే నిర్లక్ష్యభావం, ఏ స్త్రీ అయినా ఇవన్నీ యెలా భరించగలుగుతుంది ? అందరు ఆడవాళ్ళు ఎందుకంత ఆనందంగా వుండగలుగుతారు ? తనకి ఏమిటి ఇంత పిచ్చి ఆలోచనలు లేక వాళ్ళందరిలోనూ మావాళ్ల కున్నంత లాంఛనాల పిశాచి వాళ్ళల్లో వుండక పోవచ్చు. ఆవేదనగా కణతలు రుద్దుకుంటున్న ప్రవీణ పని కుర్రాడు పిలుపుకి ఉలిక్కిపడుతూ చూసింది.

''అమ్మగారు ఇదిగో ఉత్తరం ఇప్పుడే పోస్ట్‌మాన్ ఇచ్చాడు'' అంటూ ఒక ఇన్‌లాండ్ కవరు యిచ్చి, తన పని చూసుకోవడానికి వెళ్లిపోయాడు.

ఆందోళనగా అనుమానస్పదంగా కవరువిప్పింది. దానిమీద పరిచయమైన అక్షరాలు కనిపించగానే గబా, గబా చదవసాగింది ఉత్తరాన్ని

చి॥ సౌభాగ్యవతి ప్రవీణకు,

సకల ఆశీస్సులతో మీ పిన్ని లక్ష్మీదేవి వ్రాయునది అక్కడ నీవు, పిల్లలు, అల్లుడుగారు క్షేమమని తలుస్తున్నాము నేను మీ బాబయ్యగారు వచ్చి 10 రోజులు కావస్తున్నది అక్కయ్యకు బాగాలేని కారణంచేత మీ చిన్నాన్నగారు సెలవుపెట్టి వచ్చారు వీణా ! తమ సంతానంపట్ల కన్నవారు, ఎన్నో ఊహాసౌధాలు నిర్మించుకొంటారు ఆ పిల్లల సుఖసంతోషాలుకోసం, తమ జీవితాన్ని హారతిగా వెలిగిస్తారు వీణా ! ఆ పిల్లలు పెరిగి తమ చివరి క్షణాల్లో తులసితీర్థం పోస్తారనయినా కావచ్చు. మరే స్వార్థం అయినా కావచ్చు. కాని వీణా ! పిల్లల్ని తాకుతున్న అనుభూతికి లోనైనా ఆ మాతృ పితృమూర్తులకు ఇవేవి గుర్తుకురావు తమ హృదయ స్పందనలోని సన్నజాజి పరిమళానికి వివశులవుతారే తప్ప, అందులో మరే స్వార్థం వుండదు. ఇందులో ఆ తల్లితండ్రులు పిల్లలవల్ల కలిగే భావస్పందనలో ఆడపిల్ల, మగబిడ్డ అనే తారతమ్యం కనిపించదు అటువంటి తల్లితండ్రులు యెడ పిల్లలు తమ కర్తవ్యాన్ని యెంతవరకు నిర్వర్తించగలుగుతారు ? అమ్మా వీణా ! మీరు ఈ కాలంవాళ్ళు. యెంతో విజ్ఞాన దీపికలను వెలిగిస్తున్నారు మీ మేధస్సులోని పదును దిగంతాల వరకు వెళుతూన్నది. అయినా ఏం లాభం, స్వధర్మాన్ని కాలరాస్తున్నారు వీణా, కోపగించకు తల్లీ ! ఇదంతా యెందుకు రాస్తున్నాను అంటే మీ అమ్మకు ఏం బాగాలేదు. అస్తమానం నిన్నే తలుచుకొంటున్నది. ఇలా రాస్తున్నానని అక్కకు తెలియదు. నువ్వొక్కతివే కదా వాళ్లకు నేను కష్టపడుతూ ఇంకో నాలుగు రోజులు వుండగలను కాని ఎన్నాళ్ళు నా భర్త, నా సంసారం, తరువాత పనివాళ్లు వుండచ్చు కాని వీణా ! నీ తల్లి అంతిమ ఘడియల్లో తన కలలుపంట నువ్వు, నీ సంతానాన్ని కోరుకుంటున్నది. వీణా ! కంగారుపడవల్సినదేంలేదు. అమ్మకు మరేం ఫరవాలేదు. కాని నీ సన్నిధిలో మాత్రం ఆ తల్లికి వేయి ఏనుగుల బలాన్ని ఇస్తుంది. అందుకే ఇంతలా రాస్తున్నాను రావడానికి ప్రయత్నిస్తావని...

ఆశీస్సు,
పిన్ని లక్ష్మీదేవి.

అందులో వున్న అక్షరాలు తనని శూలాలుగా పొడుస్తుంటే ముఖంమీద చేతులు కప్పుకొని రోదించసాగింది ప్రవీణ తనేం చెయ్యగలదు నువ్వు ఏం చెయ్యలేవా ? గేలి చేసింది అంతరాత్మ ఎందుకు చెయ్యలేవు నీ చదువు, సంస్కారం ఏమి అయినాయి ? ఎప్పుడూ నీ సంసారం నీ సుఖం అని తలపోస్తే నీ కన్నతల్లి పట్ల

నీ కర్తవ్యాన్ని నెరవేర్చలేకపోతే, నీ జన్మ దేనికి? ఔను ఆలస్యం భరించలేదు వెళ్లాలి, ఆయన రాగానే.

కావి వారు మళ్లీ ఈ గుమ్మం తొక్కవద్దంటారు అయినాసరే తన నిర్ణయం అనునయంగా చెప్పాలి. దీనికి అత్తగారు వాళ్లు కూడా చాలా గొడవ లేవదీస్తారు అయినా తప్పదు, అనుకుంటూ బట్టలు బాగ్‌లో సర్దుతుంటే పాప ఆరు మైళ్ల దూరంలో కాన్వెంటు నుంచి రోజూ జట్కా మీద వస్తుంటుంది పాప వచ్చేసింది పిల్లలిద్దరకు ముస్తాబు పూర్తిచేసి తనూ సిద్ధం కాసాగింది సరిగ్గా రాత్రి ఏడు గంటలకు వుంది విజయవాడ వెళ్లే బస్సు

"అమ్మగారు ఇరుగో తీసుకువచ్చాను" అంటూ వచ్చాడు పని కుర్రాడు పక్కింటి వాళ్ల అబ్బాయిని చూపించి.

"ఏవిటి ఆంటీ! పిల్చారా" అడిగాడు ఆ కుర్రాడు ప్రవీణను.

"అవును బాబూ! నేను విజయవాడ వెళ్లాలి, అర్జంటుగా నువ్వు తోడు రాగలవా?" అడిగింది.

అందుకు ఆ అబ్బాయి "అలాగే వస్తాను ఆంటీ! అయితే మీరు రెడీ అయి వుండండి నేను మా అమ్మవాళ్లకి చెప్పి వచ్చేస్తాను" అంటూ ఆ కుర్రాడు వెళ్లిపోయాడు

"అమ్మగారూ, అమ్మగారూ, అయ్యగారు వచ్చారు." నెమ్మదిగా వచ్చి చెప్పాడు పనికుర్రవాడు ఒక్కసారి గుండె దడ దడ లాడింది ప్రవీణకు

మోహన్ డ్రస్సు మార్చుకుని కాఫీ తీసుకొనే వరకు ఊరుకొని తరువాత ఉత్తరం అందించింది అది తీసుకొని చదివిన మోహన్ ఆలోచిస్తూ కాసేపటికి చికాగ్గా,

"ఇది నాకు ఇచ్చావేమిటి?" అన్నాడు భార్య వంక చూస్తూ భర్త వంక పరిశీలనగా చూచి, "మా అమ్మకు మీరంటే ప్రాణం మీరు వెళ్ళకపోతే నన్ను అయినా పంపండి నాకోసం కలవరిస్తున్నది" ప్రవీణ కంఠం వణికింది

"దానికేం అలాగే వెళ్లు" హేళనగా ధ్వనించింది మోహన్ స్వరం. "మళ్ళీ రెండు రోజుల్లో వచ్చేయాలి, లేకుంటే వీల్లేదు." కఠినంగా, అధికార దర్పంగా పలుకుతున్న అతని తీరుకి, అంతవరకు ఆడసహజమైన అణుకువను తెచ్చుకొన్న ప్రవీణ అతని తీరుకు సహనం నశించగా,

'కాదు ఒక నెలా, రెండు నెలలయినా అమ్మకి మనసారా తృప్తి కలిగించేలా వుండి వస్తాను" అంది.

"ఓహో! అన్నాళ్లు వుంటావా అయితే ఇక్కడకు రానవసరంలేదు రెండు రోజులయితేనే వెళ్లు" ఆజ్ఞలా వున్న అతని ధోరణికి, స్థిరంగా,

"ఫరవాలేదు, ఇన్నాళ్లు పిచ్చిగా నా కాపురం అంటూ ఆగిపోయాను ఇన్నాళ్ళు తీర్చిదిద్ది తమ సర్వదాస్తిని నాకు ధారపోసిన నా తల్లిదండ్రుల కోసం, నేను వెళ్ళక తప్పదు." ప్రవీణ మాటలకు ఆశ్చర్యంగా చూశాడు మోహన్. అంతలోనే అతని ముఖం అరుణిమ దాల్చింది

కర్తవ్యం

"మాటలు నేర్చావు వెళ్ళు. నన్ను కాదని ఎలా, ఎన్నాళ్ళు వుండగలవో? అలనాడు సీత రాముని వెంట అరణ్యాలకు వెళ్లింది అతని కంఠంలో హేళన సుళ్ళు తిరగసాగింది ఇప్పుడు స్త్రీలు భర్తతో అమెరికా తప్ప, అతని బాధ్యతలో నూరో వంతైనా పంచుకోరు. భేష్! చాలా బావుంది"

"ఔను; ఆనాడు, ఆ సీతకి ఆ రాముడే సర్వదాస్తి పుట్టింటివారి దగ్గర నుంచి పుట్టింటి వారి ఘనతకు తగ్గట్లుగా కానుకలు తెచ్చుకొంది ఎప్పుడూ ఆవిడ పుట్టింటివాళ్లని ఆవిడ భర్త దేనిని యాచించలేదు అందుకే సీత, రాముని వెంట అరణ్యాలకి పరమసంతోషంగా వెళ్లగలిగింది కాని ఈనాడు, అన్ని దానాలలో కన్యాదానం గొప్పదనికదూ అంటారు. అటువంటిది కన్యతోపాటు అత్తవారిని దోచుకొని భార్యని అధికారంగా ఆజ్ఞాపించే భర్తలు కనుకనే వాళ్లు మీ వెంట అరణ్యాలకు రాలేరు"

ప్రవీణ మాటలకు మండిపడుతూ అగ్నిజ్వాలల్ని కురిపిస్తూ, "వీణా! వెళితే నువ్వు వెళ్లు పిల్లలు రారు" మోహన్ మాటలకి నిలువెల్లా వణికిపోయింది ప్రవీణ ఎందుకని బేలగా అడుగుతున్న ప్రవీణను చూసి "వాళ్లు నా పిల్లలు గనుక."

రచయితలకు మనవి

స్థానికంగా వున్న రచయితలు కార్టూనిస్టులు కూడా మా కార్యాలయానికి వచ్చి వారి రచనలందజేస్తున్నప్పుడు వాటితోపాటు స్వంత చిరునామా గల స్టాంపులంటించిన కవరు పెట్టడం అవసరం సం

మోహన్ జవాబుకి అతనివంక పరిశీలనగా చూస్తూ వాళ్ళు "నా పిల్లలుకూడా" అంది ప్రవీణ

ప్రవీణ కళ్లలోకి చూచి "పాపకి చదువు పాడవుతుంది తీసుకువెళితే బాబుని తీసుకు వెళ్ళచ్చు" ఏదో దానం చేస్తున్నట్టుగ చూస్తూ, భార్యలోని మాతృత్వంలోని సంఘర్షణను రేపుతూ కర్కశంగా బయటికి వెళ్లిపోయాడు మోహన్

విలవిలలాడిపోయింది ప్రవీణలోని మాతృత్వం, మమకారం రాయిలా బిగిసిపోయిన ప్రవీణ చైతన్యాన్ని కోల్పోయినదానిలా అయిపోయింది.

"ఆంటీ, ఇంకా తయారుకాలా! టైము ఎంతయిందో తెలుసా! ఇప్పుడు వెళ్లకపోతే మనం బస్సును అందుకోలేం" అన్నాడు కంగారుగ పిస్తూ పక్కింటివాళ్ల అబ్బాయి

వులిక్కిపడుతూ చూచింది అతనివంక కదలిపోతున్న హృదయాన్ని చిక్కబట్టుకుంటూ రాయిలా చూస్తున్న ప్రవీణను ఆశ్చర్యంగా చూస్తూ ఉండిపోయాడు ఆ కుర్రాడు ఏమనాలో తెలియక. చాలాసేపటికి మెల్లగా,

ఆంటీ అని పిల్చాడు మరల తేరుకున్న ప్రవీణకి దుఃఖం ముంచెత్తసాగింది నా చిట్టి తల్లిని విడిచి బ్రతకడమా అని మనసు రోదించసాగింది మళ్ళీ అంతలోనే రోషం పెనవేసుకొంది వెళ్ళితీరాల అనుకుంటూ పనికుర్రాడని పిల్చి పాపని ఆటలకు తీసుకొని వెళ్ళమని, తను బాబుతో సహా, పనికుర్రాడు పాపని మభ్యపరిచి తీసుకు వెళ్ళిపోయాక, పక్కింటివాళ్ళ అబ్బాయి రిక్షా పిలవగా, జాలువారుతున్న కన్నీటిని తుడుచుకొంటూ, బాబుతోసహా ఎక్కేసింది ప్రవీణ

"బస్సుస్టాప్ వచ్చింది, దిగండి ఆంటీ" చెప్పాడు కుర్రాడు

మెల్లగా దిగింది ప్రవీణ అక్కడ వున్నవాళ్ళు చెప్పారు ఇప్పుడే విజయవాడ బస్సు వెళ్ళిపోయిందని అసలే శక్తి నశించిన ప్రవీణకు, తను వెళుతున్న మార్గం చీకటి అవుతున్నట్లు భావన కళ్ళు చీకట్లు కమ్మసాగాయి వళ్ళంతా నీరసం ఆవహించగా అతికష్టంమీద నిగ్రహించుకుంటూ కనులు మూసుకొంది

"మమ్మీ, మమ్మీ!" ఎక్కడనుంచో పిలుపు ప్రవీణకు దుఃఖం పొర్లుకురాసాగింది

"వీణా!"

మృదుగంభీరమయిన ఆ కంఠం ప్రవీణకు ఎంత దూరాన వున్నా విన్పిస్తుంది తనని రెండు బలమయిన చేతులు తట్టి పిలుస్తుంటే కనులు తెరిచింది కంగారుగా ప్రవీణ ఎదురుగా మోహన్, పక్కన పాప సంభ్రమాశ్చర్యాలతో చూడసాగింది ప్రవీణ ఎందుకు అన్నట్లు చూస్తున్న ప్రవీణ కళ్ళల్లోకి చూస్తూ,

"వీణా, పాప నేను కూడా వస్తాం ఇదిగో టాక్సీ తీసుకువచ్చాను" అన్నాడు మోహన్ అక్కడ ఆగివున్న టాక్సీని చూపిస్తూ. ఇంకా సందేహంగా చూస్తున్న ప్రవీణతో, "నువ్వు, బాబు అత్తయ్యకి బాగా తేలిక అయ్యేవరకు వుండచ్చు నేను, పాప అప్పుడప్పుడు వచ్చి చూస్తుంటాం" అన్నాడు

"అంకుల్, అయితే నేను వెళ్లివస్తానుమరి" అన్నాడు, ఆ కుర్రాడు

"ఆఁ మంచిది బాబూ వెళ్లిరా నిన్ను శ్రమపెట్టాం" అన్నారు మోహన్, ప్రవీణలు

"ఫర్వాలేదండి" అంటూ సెలవు తీసుకొని నిష్క్రమించాడు ఆ కుర్రాడు

"ఏవండీ. మిమ్మల్ని చాలా మాటలు అన్నానుకదూ!" బాధగా అడుగుతున్న ప్రవీణను చూస్తూ,

"వీణా, నువ్వన్నది అక్షరాలా నిజం ఇన్నాళ్ళు అల్లుడిగా అహాన్ని చూపించానేగాని వాళ్ల కష్టంలో భాగం పంచుకోలేకపోయాను ఇకనుంచి నావాళ్ళు, నీవాళ్ళు అని భేదం లేదు ఇరుపక్కల వాళ్లు మనని కని పెంచి, ప్రయోజకులను చేసిన వాళ్ళే వాళ్ల పట్ల మనం నిర్వర్తించాల్సిన కర్తవ్యాన్ని మరవకూడదు" అన్నాడు, టాక్సీ వేపుగా అడుగులువేస్తూ ఇద్దరు పిల్లలతో మనసెరిగిన భర్తగా బాధ్యత వహిస్తూ, అడుగులు వేస్తున్న భర్తను సంతోషంగా అనుసరించింది ప్రవీణ